PRGI No. APTEL/2010/31893

# కొత్తస్వరం

తెలుగు దిన పత్రిక

గురువారం,
జూన్ 18, 2026

TG & AP

సంపుటి : 16 (Vallume : 16)
| సంచిక : 14 (Issue: 14) |
పేజీలు : 4 (Pages : 4) |
వెల : రూ 2.00/-
(Rs : 2.00/-)

## అరెస్ట్ చేస్తే అమర్‌నాథ్ ఇంకా పెద్ద నేత అవుతాడు: పేర్ని నాని

అమర్‌నాథ్‌పై 10 నుంచి 15 కేసులు పెట్టే ప్రయత్నమంటూ ఆరోపణ

పవన్ పాత వీడియోలతో రివర్స్ కౌంటర్

పదవి వచ్చాకే పవన్‌కు సంస్కారం గుర్తొచ్చిందా?

అమర్‌నాథ్ వ్యాఖ్యలపై ప్రశ్నించిన మాజీ మంత్రి

కూటమి నేతలపై విమర్శల వెల్లువ

2




## హర్మూజ్‌లో ఆంక్షలు ఉండరాదు: ప్రధాని మోదీ

భారత నావికుల భద్రతే ప్రధాన ఆందోళన

హర్మూజ్ స్వేచ్ఛా వాణిజ్యానికి అందుబాటులో ఉండాలని స్పష్టం

ట్రంప్‌తో భేటీలో ద్వైపాక్షిక అంశాలపై చర్చ

మోదీ నా మంచి మిత్రుడు అంటూ ట్రంప్ ప్రశంస

త్వరలో వాణిజ్య ఒప్పందంపై ఆశాభావం

# ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ కాదు

సీఎం రేవంత్ రెడ్డి

సర్కార్ బడుల నుంచే ఐఏఎస్, ఐపీఎస్‌లు వచ్చారని వ్యాఖ్య

ఆరుట్లలో రూ.15 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభం

కులమతాలకు అతీతంగా నాణ్యమైన విద్య లక్ష్యమని స్పష్టం

మట్టిలో మాణిక్యాలను వెలికితీసేది ప్రభుత్వ విద్యేనని నమ్మకం

విద్యతోనే సమాజంలో సమానత్వం సాధ్యమని సీఎం వెల్లడి



ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం నామోషీ కాదని, అక్కడి నుంచే ఐఏఎస్, ఐపీఎస్‌లు, ముఖ్యమంత్రులు ఎదిగారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో రూ.15 కోట్లతో నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించిన ఆయన, నాణ్యమైన విద్య ద్వారానే సమాజంలో సమానత్వం సాధ్యమని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల పిల్లలు కలిసి చదివేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యే మట్టిలో మాణిక్యాలను వెలికితీసే శక్తి కలిగిన వ్యవస్థ అని అభిప్రాయపడ్డారు. పేద విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని ఉచిత విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం వెల్లడించారు.

- కొత్తస్వరం న్యూస్, రంగారెడ్డి

4

## యోగాంధ్ర కార్యక్రమంలో యోగాసనాలు వేసిన హోంమంత్రి అనిత

ఉపమాకలో ఘనంగా యోగాంధ్ర నిర్వహణ

కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ సీఎం రమేష్

మానసిక ప్రశాంతతకు యోగా అవసరమని హోంమంత్రి సూచన



**అనకాపల్లి, జూన్ 17 (కొత్త స్వరం):**
అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాకలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా హోంమంత్రి, ఎంపీతో పాటు అధికారులు యోగాసనాలు వేశారు. యోగ సాధన ద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ, యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనానికి యోగా ఎంతో అవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఏళ్లుగా విధులకు గైర్హాజరు.. 43 మంది వైద్యులపై వేటు

ప్రభుత్వ వైద్య సేవలకు దూరమైన వైద్యులపై కఠిన చర్యలు

నాలుగేళ్లుగా హాజరుకాని వారిని శాశ్వతంగా తొలగించే నిర్ణయం

నోటీసులు, అభియోగాలకూ స్పందన లేకపోవడంతో చర్యలు వేగవంతం

2



## అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమాని నిరంజన్‌ను పరామర్శించిన పవన్ కళ్యాణ్

అభిమాని కోరికను గౌరవించి ఇంటికే వెళ్లిన ఉప ముఖ్యమంత్రి

నిరంజన్ ఆరోగ్యంపై ఆరా తీసి కుటుంబానికి భరోసా

వైద్య ఖర్చులకు రూ. లక్ష ఆర్థిక సాయం

వెంకటేశ్వరస్వామి తీర్థప్రసాదాలు అందజేత

భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు హామీ

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: భట్టి విక్రమార్క

రైతులు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

పేదలు కూడా సన్నబియ్యం తినేలా చర్యలు

సన్నరకాల వరి సాగుకు రైతు కమిషన్ సిఫారసు

ధాన్యం కొనుగోలు, నిల్వ సదుపాయాలపై కేబినెట్ సబ్ కమిటీ చర్చ

నాణ్యమైన వంగడాలతో రైతుల ఆదాయం పెంపుపై దృష్టి

2



## రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో గుడిసెవాసులకు ప్రాధాన్యం

75 వేల గుడిసెవాసుల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన

2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధం

ప్రతి నియోజకవర్గానికి 2 వేల ఇళ్లు లక్ష్యం

రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకానికి ప్రత్యేక ప్రాధాన్యం

ప్రమాదకర పైకప్పుల మార్పునకు రూ.2 లక్షల సాయం

2



## ముఖ్యమంత్రిని కలిసిన ఈషా సింగ్.. స్వర్ణ విజేతకు ఘన సత్కారం

ప్రపంచ రికార్డు సాధించిన క్రీడాకారిణికి ముఖ్యమంత్రి అభినందనలు

స్వర్ణ పతకంతో తెలంగాణకు కీర్తి తెచ్చిన ఈషా సింగ్

మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించిన రేవంత్ రెడ్డి

2



## సాయికృష్ణ కేసుపై సీబీఐ విచారణకు ఆదేశించండి: అంబటి రాంబాబు

లాకప్ డెత్ జరిగిందంటూ తీవ్ర ఆరోపణలు

పోలీసులు హత్య చేసి శవాన్ని మాయం చేశారని విమర్శ

పవన్ కళ్యాణ్ స్పందించాలని మాజీ మంత్రి డిమాండ్

సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో విచారణ జరపాలని విజ్ఞప్తి

పార్టీలకు అతీతంగా ఉద్యమం చేయాలని పిలుపు



2

కొత్తస్వరం
తెలుగు దిన పత్రిక
https://kothaswaram.com



# అరుదైన వ్యాధితో బాధప డుతున్న అభిమాని నిరంజన్‌ను పరామర్శించిన పవన్ కళ్యాణ్









**అభిమాని కోరికను గౌరవించి ఇంటికే వెళ్లిన ఉప ముఖ్యమంత్రి**
**నిరంజన్ ఆరోగ్యంపై ఆరా తీసి కుటుంబానికి భరోసా**
**వైద్య ఖర్చులకు రూ. లక్ష ఆర్థిక సాయం**
**వెంకటేశ్వరస్వామి తీర్థప్రసాదాలు అందజేత**
**భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు హామీ**

హనుమకొండ, జూన్ 17 (కొత్త స్వరం):
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. అరుదైన డి.ఎన్.డి జన్యుపరమైన వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమైన యువ అభిమాని నిరంజన్ కోరికను గౌరవించి స్వయంగా అతని నివాసానికి వెళ్లి పరామర్శించారు. తెలంగాణ రాష్ట్రం హనుమకొండ పట్టణంలోని హనుమాన్ నగర్‌కు చెందిన 17 ఏళ్ల నిరంజన్ అరుదైన వ్యాధితో పోరాడుతున్నాడు. తన చివరి కోరికగా పవన్ కళ్యాణ్‌ను కలవాలని కోరుకున్నాడు. తెలంగాణ జనసేన నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న పవన్ కళ్యాణ్ బుధవారం నిరంజన్ ఇంటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. నిరంజన్‌ను దగ్గరకు తీసుకుని పరామర్శించిన పవన్ కళ్యాణ్, తల్లిదండ్రులు పొనుగోటి రంగోపాల్, మానసతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యం ఎక్కడ జరుగుతోంది? ఇంకా ఏం చేయొచ్చు? వంటి అంశాలపై ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని, భగవంతుడి ఆశీస్సులు నిరంజన్‌కు ఉంటాయని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. శ్రీ వెంకటేశ్వరస్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి భగవంతుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1 లక్ష ఆర్థిక సాయం అందజేశారు. అలాగే నిరంజన్ ఆరోగ్యం కోసం వరంగల్ భద్రకాళీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయిస్తానని తెలిపారు. నిరంజన్‌ను చూసిన పవన్ కళ్యాణ్ భావోద్వేగానికి లోనయ్యారు. మంచంపై అతని పక్కనే కూర్చుని ఆత్మీయంగా హత్తుకుని, నుదిటిపై ముద్దు పెట్టి పలకరించారు. "చిన్ననాటి నుంచి మీరంటే అభిమానం" అని నిరంజన్ చెప్పడంతో కదిలిపోయారు. తిరుమల నుంచి తెప్పించిన వస్త్రాన్ని కప్పి, కళ్యాణ అక్షతలు ఇచ్చి ఆశీర్వదించారు. నిరంజన్ ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్ కళ్యాణ్‌ను అనుకరిస్తూ చేసిన డాన్స్ వీడియోలు, ఫొటోలను తిలకించారు. అందరూ తనను "చోటా గబ్బర్ సింగ్" అని పిలుస్తారని నిరంజన్ చెప్పాడు. ఈ సందర్భంగా నిరంజన్ ఒక కుక్క పిల్లను పెంచుకోవాలని తన కోరికను తెలిపాడు. దానిని కొనిపంపుతానని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. ఇంటి యజమానుల అనుమతి అవసరమని నిరంజన్ తండ్రి చెప్పడంతో, వారితో స్వయంగా మాట్లాడారు. నిరంజన్ తల్లిదండ్రుల జీవనోపాధి వివరాలు తెలుసుకున్న పవన్ కళ్యాణ్, వారు గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటీన్‌లో పనిచేసేవారని తెలుసుకుని, వారి ఉపాధి మెరుగుపర్చేందుకు క్యాంటీన్ ఏర్పాటు చేయాలని జనసేన తెలంగాణ నాయకులకు దిశానిర్దేశం చేశారు. నిరంజన్ పరామర్శ అనంతరం పవన్ కళ్యాణ్ నేరుగా వరంగల్ భద్రకాళీ అమ్మవారి ఆలయానికి బయలుదేరి వెళ్లారు. ఆయనతో పాటు జనసేన తెలంగాణ ఇన్‌చార్జ్ శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, పార్టీ నాయకులు రాధారం రాజలింగం, ఆర్.కే. సాగర్ తదితరులు ఉన్నారు.

## అరెస్ట్ చేస్తే అమర్‌నాథ్ ఇంకా పెద్ద నేత అవుతాడు: పేర్ని నాని

**అమర్‌నాథ్‌పై 10 నుంచి 15 కేసులు పెట్టే ప్రయత్నమంటూ ఆరోపణ**
**పవన్ పాత వీడియోలతో రివర్స్ కౌంటర్**
**పదవి వచ్చాకే పవన్‌కు సంస్కారం గుర్తొచ్చిందా?**
**అమర్‌నాథ్ వ్యాఖ్యలపై ప్రశ్నించిన మాజీ మంత్రి**
**కూటమి నేతలపై విమర్శల వెల్లువ**

అమరావతి, జూన్ 17 (కొత్త స్వరం):
మంత్రి వంగలపూడి అనిత, వైసీపీ నేత గుడివాడ అమర్‌నాథ్ మధ్య కొనసాగుతున్న రాజకీయ వివాదంలో మాజీ మంత్రి పేర్ని నాని ఎంట్రీ ఇచ్చారు. ఈ అంశంపై బుధవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కూటమి నేతలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా గతంలో పవన్ కళ్యాణ్ మరియు ఇతర టీడీపీ నేతలు మాట్లాడిన పాత వీడియోలను ప్రదర్శిస్తూ రివర్స్ అటాక్ చేశారు. పవన్ కళ్యాణ్ గతంలో ఉపయోగించిన పదజాలాన్ని ప్రస్తావిస్తూ, "మేమంతా పవన్ కళ్యాణ్ కొడుకులమా? మరి ఆయన మాట్లాడింది సంస్కారవంతమైన భాషేనా?" అని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి పదవి వచ్చాకే పవన్ కళ్యాణ్‌కు సంస్కారం గుర్తొచ్చిందా అని పేర్ని నాని నిలదీశారు. అమర్‌నాథ్‌పై 10 నుంచి 15 కేసులు పెట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని ఆరోపించారు. అయితే అరెస్టులకు తాము భయపడబోమని స్పష్టం చేసిన ఆయన, "అమర్‌నాథ్‌ను అరెస్ట్ చేస్తే ఆయన ఇంకా పెద్ద నాయకుడిగా ఎదుగుతాడు తప్ప నష్టం ఏమీ లేదు" అని వ్యాఖ్యానించారు. హోంమంత్రి కట్టుబొట్టు గురించి అమర్‌నాథ్ ఎక్కడ మాట్లాడారని ప్రశ్నించిన పేర్ని నాని, ఆ అంశాన్ని ఉద్దేశపూర్వకంగా రాజకీయంగా మలుస్తున్నారని విమర్శించారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో ఒక తల్లి తన కుమారుడు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నా పట్టించుకోని పవన్ కళ్యాణ్, తెలంగాణలో అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని పరామర్శించేందుకు వెళ్లారని ఎద్దేవా చేశారు.

## రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో గుడిసెవాసులకు ప్రాధాన్యం

**75 వేల గుడిసెవాసుల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన**
**2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధం**
**ప్రతి నియోజకవర్గానికి 2 వేల ఇళ్లు లక్ష్యం**
**రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకానికి ప్రత్యేక ప్రాధాన్యం**
**ప్రమాదకర పైకప్పుల మార్పునకు రూ.2 లక్షల సాయం**

హైదరాబాద్, జూన్ 17 (కొత్త స్వరం):
ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో గుడిసెవాసులకే తొలి ప్రాధాన్యం ఇస్తామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లపై గృహనిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల గుర్తింపునకు ప్రత్యేక సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 75 వేల గుడిసెవాసుల దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపడతామని తెలిపారు. అర్హుల ఎంపికను పూర్తి పారదర్శకతతో నిర్వహిస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటివరకు దరఖాస్తు చేయని గుడిసెవాసులకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రెండో విడతలో 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 2 వేల ఇళ్లు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున నిర్మాణం చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా 50 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రమాదకర స్థితిలో ఉన్న ఇంటి పైకప్పుల మార్పునకు రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తామని మంత్రి తెలిపారు. అసంపూర్తిగా వదిలిన ఇళ్లను కూడా ఈ పథకంలో చేర్చనున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారుడే ఇంటి నిర్మాణదారుడని, బీఎల్‌సీ విధానంలో నిర్మాణాలు చేపడతామని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో అవసరమైతే జీ ప్లస్ 1 నిర్మాణాలకు అనుమతులు ఇవ్వనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరించారు.

## హర్మూజ్‌లో ఆంక్షలు ఉండరాదు: ప్రధాని మోదీ

**భారత నావికుల భద్రతే ప్రధాన ఆందోళన**
**హర్మూజ్ స్వేచ్ఛా వాణిజ్యానికి అందుబాటులో ఉండాలని స్పష్టం**
**మోదీ నా మంచి మిత్రుడు అంటూ ట్రంప్ ప్రశంస**
**త్వరలో వాణిజ్య ఒప్పందంపై ఆశాభావం**

ప్యారిస్, జూన్ 17 (కొత్త స్వరం):
హర్మూజ్ జలసంధి వద్ద ఎలాంటి ఆంక్షలు ఉండకూడదని, అక్కడ స్వేచ్ఛాయుత సముద్ర వాణిజ్యం కొనసాగాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న వేలాది మంది భారతీయ నావికుల భద్రత తమకు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ–7 సదస్సు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం, పశ్చిమాసియా పరిస్థితులపై చర్చలు జరిగాయి. ప్రధాని మోదీ మాట్లాడుతూ, పశ్చిమాసియాలో శాంతి స్థాపన కోసం ట్రంప్ చేసిన కృషిని అభినందించారు. హర్మూజ్ జలసంధి తెరచి ఉండటం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఎంతో అవసరమని తెలిపారు. "ప్రపంచానికి హర్మూజ్ తెరవడం అత్యవసరం. సముద్రయాన స్వేచ్ఛను కచ్చితంగా కాపాడాలి. సముద్ర వాణిజ్య రంగంలో లక్షలాది మంది భారతీయ నావికులు ప్రపంచవ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్నారు. వారి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి" అని మోదీ పేర్కొన్నారు. త్వరలో భారత్–అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశాలు ఉన్నాయని ప్రధాని తెలిపారు. నావికుల భద్రతకు భరోసా లభించేలా చర్యలు తీసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ట్రంప్ మాట్లాడుతూ, ఫ్రాన్స్‌లో జరిగిన సమావేశాలు ఫలప్రదంగా సాగాయని అన్నారు. ముఖ్యంగా ప్రధాని మోదీతో చాలా మంచి చర్చలు జరిగాయని చెప్పారు. "మోదీ నాకు చాలా కాలంగా మంచి మిత్రుడు. మా మధ్య ఎప్పుడూ గొప్ప సంబంధం ఉంది. భారతదేశం పట్ల నాకు ఎంతో గౌరవం ఉంది. మోదీ ప్రశాంతంగా కనిపిస్తారు, కానీ చాలా గట్టి నాయకుడు" అంటూ ట్రంప్ ప్రశంసించారు. అమెరికా–భారత్ మధ్య అనేక కీలక అంశాల్లో పురోగతి సాధిస్తున్నామని, వాణిజ్య సహకారం మరింత బలపడుతుందని ట్రంప్ పేర్కొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: భట్టి విక్రమార్క

**రైతులు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం**
**పేదలు కూడా సన్నబియ్యం తినేలా చర్యలు**
**సన్నరకాల వరి సాగుకు రైతు కమిషన్ సిఫారసు**
**ధాన్యం కొనుగోలు, నిల్వ సదుపాయాలపై కేబినెట్ సబ్ కమిటీ చర్చ**
**నాణ్యమైన వంగడాలతో రైతుల ఆదాయం పెంపుపై దృష్టి**

హైదరాబాద్, జూన్ 17 (కొత్త స్వరం):
రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రైతులు ఆర్థికంగా ఎదగడంతో పాటు లాభదాయక వ్యవసాయం వైపు తెలంగాణ అడుగులు వేయాలని సూచించారు. సచివాలయంలో భట్టి విక్రమార్క అధ్యక్షతన బుధవారం జరిగిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు, నిల్వ సదుపాయాలు, వానాకాలం సాగుపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, పేదలు కూడా సన్నబియ్యం తినాలని, రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలని ప్రభుత్వం సంకల్పంతో పనిచేస్తోందన్నారు. నాణ్యమైన వరి రకాల సాగుకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. తెలంగాణ సోనా, బీపీటీ 5204, జై శ్రీరామ్, హెచ్‌ఎంటీ వంటి సన్నరకాల వంగడాల సాగుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. ఈ రకాల పంటలకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మంచి డిమాండ్ ఉండటంతో రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. గ్రామగ్రామాన రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి మేలుజాతి వంగడాల సాగుపై చైతన్యం కల్పించాలని రైతు కమిషన్ సూచించినట్లు తెలిపారు. రాబోయే సీజన్లలో నాణ్యమైన వరి రకాల సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) కొనుగోళ్లు తగ్గించడం రైతులకు ఇబ్బందిగా మారిందని వ్యవసాయ కమిషన్ అభిప్రాయపడిందన్నారు. బాయిల్డ్ రైస్ కొనుగోళ్లు నిలిపివేయడంపై కూడా ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల తెలంగాణ రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటోందని భట్టి విక్రమార్క విమర్శించారు. రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రజాప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జాతీయ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'అమ్మ మాట అంగన్‌వాడి బాట' కార్యక్రమం ప్రారంభం







**పర్వత్‌పల్లి అంగన్‌వాడి కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం**
**ఆటపాటలతో విద్య అందించి సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం**
**గర్భిణీలు, బాలింతలకు అంగన్‌వాడి సేవలపై అవగాహన**

తాండూరు, జూన్ 17 (కొత్త స్వరం):
వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం పర్వత్‌పల్లి అంగన్‌వాడి కేంద్రంలో సామాజిక అక్షరాభ్యాస కార్యక్రమంలో భాగంగా బుధవారం 'అమ్మ మాట అంగన్‌వాడి బాట' కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పాండురంగారెడ్డి, సూపర్‌వైజర్ బాలమణి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రెండేళ్లు దాటిన పిల్లల పేర్లను ఇంటింటికీ తిరిగి నమోదు చేసుకుంటామని తెలిపారు. అంగన్‌వాడి కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యను అందించడం ద్వారా పిల్లల్లో శారీరక అభివృద్ధితో పాటు మానసిక వికాసం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతలు, చంటి పిల్లలకు అంగన్‌వాడి కేంద్రం ద్వారా అందే సేవలు, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రేణుక, మదర్స్ కమిటీ సభ్యులు, ఆశ వర్కర్, పిల్లల తల్లులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## సాయికృష్ణ కేసుపై సీబీఐ విచారణకు ఆదేశించండి: అంబటి రాంబాబు

**లాకప్ డెత్ జరిగిందంటూ తీవ్ర ఆరోపణలు**
**పోలీసులు హత్య చేసి శవాన్ని మాయం చేశారని విమర్శ**
**సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో విచారణ జరపాలని విజ్ఞప్తి**
**పార్టీలకు అతీతంగా ఉద్యమం చేయాలని పిలుపు**

అమరావతి, జూన్ 17 (కొత్త స్వరం):
23 ఏళ్ల యువకుడు గాదె సాయికృష్ణ లాకప్ డెత్‌కు గురయ్యాడని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. ఈ ఘటనపై సీబీఐ విచారణ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడిన అంబటి రాంబాబు, "సాయికృష్ణను పోలీసులు హత్య చేసి శవాన్ని మాయం చేశారు. దేశంలో ఇంత ఘోరమైన లాకప్ డెత్ ఎక్కడా జరగలేదు" అని తీవ్ర ఆరోపణలు చేశారు. సాయికృష్ణ మేనమామ నవరంగ్ తనను కలిసి విషయం వివరించారని చెప్పారు. "నవరంగ్ తాను జనసేన కార్యకర్తనని తెలిపారు. సాయికృష్ణ తల్లి పడుతున్న వేదన ఎవరినైనా కలచివేస్తుంది. ఈ అంశంపై పార్టీలకు అతీతంగా ఉద్యమం చేయాలి" అని అన్నారు. ఈ కేసుపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించిన అంబటి, "పవన్ కళ్యాణ్‌కు చేతులు జోడించి వేడుకుంటున్నాను. సీబీఐ విచారణకు ఆదేశించండి. మనం మానవులం కదా" అని వ్యాఖ్యానించారు. సాయికృష్ణ మేనమామ నవరంగ్ కూడా మీడియాతో మాట్లాడుతూ, ఈ విషయాన్ని రాజకీయ పార్టీలకు ముడిపెట్టడం సరికాదన్నారు. "ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే దాడి చేసి చంపి దహనం చేయడమా? ఆ తల్లి బాధ ఎవరికీ రాకూడదు" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

## ఏళ్లుగా విధులకు గైర్హాజరు.. 43 మంది వైద్యులపై వేటు

**ప్రభుత్వ వైద్య సేవలకు దూరమైన వైద్యులపై కఠిన చర్యలు**
**నాలుగేళ్లుగా హాజరుకాని వారిని శాశ్వతంగా తొలగించే నిర్ణయం**
**నోటీసులు, అభియోగాలకూ స్పందన లేకపోవడంతో చర్యలు వేగవంతం**

అమరావతి, జూన్ 17 (కొత్త స్వరం):
ప్రభుత్వ వైద్య సేవలకు దూరంగా అనధికారికంగా విధులకు గైర్హాజరైన 43 మంది వైద్యులపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కఠిన చర్యలకు ఉపక్రమించింది. గరిష్టంగా నాలుగేళ్ల నుంచి విధులకు హాజరుకాని ఈ వైద్యులకు నిబంధనల ప్రకారం సంజాయిషీ నోటీసులు జారీ చేయడంతో పాటు అభియోగాలు నమోదు చేసినప్పటికీ స్పందన రాకపోవడంతో వారిని విధుల నుంచి శాశ్వతంగా తప్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. గత నెలలో వైద్య విద్య సంచాలకత్వ పరిధిలోని బోధనా ఆసుపత్రుల్లో పనిచేసే 51 మంది వైద్యులను కూడా ఇదే విధంగా సేవల నుంచి తప్పించినట్లు తెలిపారు. ఇదే తరహాలో ద్వితీయ ఆరోగ్య సేవల పరిధిలో కూడా చర్యలు తుది దశకు చేరుకున్నాయి. మొత్తం 118 మంది శాశ్వత వైద్యులు అనధికారికంగా విధులకు దూరంగా ఉన్నట్లు గుర్తించారు. వీరిలో 34 మంది రాజీనామాలు చేయగా, 9 మంది తిరిగి విధుల్లో చేరారు. మరో 13 మంది అభ్యర్థనలు ప్రభుత్వ పరిశీలనలో ఉండగా, మిగిలిన వారిపై విచారణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

## ముఖ్యమంత్రిని కలిసిన ఈషా సింగ్.. స్వర్ణ విజేతకు ఘన సత్కారం

**ప్రపంచ రికార్డు సాధించిన క్రీడాకారిణికి ముఖ్యమంత్రి అభినందనలు**

హైదరాబాద్, జూన్ 17 (కొత్త స్వరం) :
మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ క్రీడాకారిణి, అర్జున పురస్కార గ్రహీత ఈషా సింగ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ప్రపంచ కప్ తుపాకీ గురితప్పని పోటీల్లో ఈషా సింగ్ స్వర్ణ పతకం సాధించడంతో పాటు ప్రపంచ రికార్డును కూడా కైవసం చేసుకున్నారు. ఈ విశిష్ట విజయాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఆమెను అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా క్రీడల్లో ఆమె చూపుతున్న ప్రతిభ ప్రశంసనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించి దేశానికి, తెలంగాణకు మరింత గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు.

## సాయికృష్ణ ఘటనపై సీఎం సీరియస్

**చంద్రబాబు, పవన్ సమక్షంలో పోలీస్ అధికారులతో సమీక్ష**
**సీఐ నాగరాజుపై చర్యలకు ఆదేశం**
**సీనియర్ ఐపీఎస్ అధికారితో విచారణకు నిర్ణయం**
**నిష్పాక్షపాత దర్యాప్తు జరపాలని డీజీపీకి సూచన**
**బాధ్యులపై కఠిన చర్యలు తప్పవన్న సీఎం**

అమరావతి, జూన్ 17 (కొత్త స్వరం):
సాయికృష్ణ ఘటనపై ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు సీఐ నాగరాజును సస్పెండ్ చేయాలని పోలీస్ ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సాయికృష్ణ అదృశ్యం ఘటనపై సీనియర్ ఐపీఎస్ అధికారితో ఉన్నతస్థాయి దర్యాప్తు నిర్వహించాలని సీఎం నిర్ణయించారు. బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలతో పాటు సాయికృష్ణ ఘటనపై ప్రత్యేకంగా చర్చించారు. సింగపూర్ పర్యటన ముగించుకుని సచివాలయానికి చేరుకున్న వెంటనే ముఖ్యమంత్రి పోలీస్ ఉన్నతాధికారులను పిలిపించుకుని ఘటనపై సమగ్ర సమాచారం తీసుకున్నారు. సాయికృష్ణ అదృశ్యం కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సీఎంకు, డిప్యూటీ సీఎంకు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఘటనపై నిష్పాక్షపాతంగా దర్యాప్తు జరపాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. నిజానిజాలు వెలికితీసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో సీఎస్ సాయిప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్రలడ్డా, విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు పాల్గొన్నారు. గాదె సాయికృష్ణ అనే యువకుడిని లాకప్‌లో కొట్టి చంపారనే ఆరోపణలు పోలీసులపై ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే కృష్ణలంక పోలీస్ స్టేషన్ సీఐను వీఆర్‌కు పంపినట్లు డీజీపీ, సీఎం చంద్రబాబు మరియు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు వివరించారు.

కొత్తస్వరం
తెలుగు దిన పత్రిక
కర్నూలు - నంద్యాల
గురువారం, జూన్ 18, 2026



## ఎరువుల దుకాణంపై జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**దేవనకొండలో మన గ్రోమోర్ యూరియా దుకాణాన్ని పరిశీలించిన కలెక్టర్**

**రైతుల వివరాల నమోదు ప్రక్రియపై ప్రత్యేక ఆరా**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**

**కర్నూలు, జూన్ 17 (కొత్త స్వరం):**
దేవనకొండ మండల కేంద్రంలోని మన గ్రోమోర్ యూరియా దుకాణాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు ఎరువుల సరఫరా విధానం, నమోదు ప్రక్రియపై సమగ్రంగా పరిశీలించారు. ప్రత్యేకంగా ఏపీఐఎంఎస్ దరఖాస్తు ద్వారా రైతుల వివరాలను ఏ విధంగా నమోదు చేస్తున్నారో కలెక్టర్ పరిశీలించి, నమోదు ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. రైతులకు సకాలంలో ఎరువులు అందేలా దుకాణదారులు బాధ్యతగా వ్యవహరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ కొరత తలెత్తకుండా సరఫరా కొనసాగించాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.



# 98 ఏళ్ల చరిత్ర కలిగిన వేంపెంట శ్రీ రామాలయంలో శిఖర ధ్వజ ప్రతిష్ఠ ప్రారంభం

**కార్యక్రమాన్ని ప్రారంభించిన నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి**

**భక్తిశ్రద్ధల నడుమ శిలాఫలకం ఆవిష్కరణ**

**ఏడు సంవత్సరాల నిరీక్షణకు ముగింపు పలికిన పునఃప్రతిష్ఠ మహోత్సవం**

**మూడు రోజుల పాటు వైభవంగా యాగాలు, హోమాలు, ఆధ్యాత్మిక వేడుకలు**

**భక్తులకు అన్నప్రసాదం, వసతి ఏర్పాట్లతో విశేష సేవలు**

**పాములపాడు, జూన్ 17 (కొత్త స్వరం):**
పాములపాడు మండలంలోని వేంపెంట గ్రామంలో 98 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ సీతారామలక్ష్మణ హనుమత్సమేత శ్రీ రామాలయంలో శిఖర ధ్వజ ప్రతిష్ఠా కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి ప్రారంభించారు. ఆలయ చైర్మన్ టేకూరి రామసుబ్బమ్మ, సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకూరి నాగేశ్వరరావు, టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు కంభం మోహన్ గౌడ్, సొసైటీ చైర్మన్ లక్ష్మీకాంతరెడ్డి, ఆలయ పాలక మండలి సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మొదట మాండ్ర శివానందరెడ్డికి వరల్డ్ హ్యూమన్ రైట్స్ అవార్డు గ్రహీత డాక్టర్ టేకూరి నాగేశ్వరరావు, ఆలయ చైర్మన్ టేకూరి రామసుబ్బమ్మ, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కంభం మోహన్ గౌడ్ తదితరులు శాలువాలు కప్పి, పూల మాలలు వేసి, మెమెంటో అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాండ్ర శివానందరెడ్డి, డాక్టర్ టేకూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ శ్రీ రామాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవానికి అందరికీ పేరుపేరునా ఆహ్వానం పలికారు. ఏడు సంవత్సరాల నిరీక్షణకు ముగింపు పలుకుతూ 31-03-2019న స్వర్గీయ టేకూరి గాండ్ల కృష్ణుడు, టేకూరి రామసుబ్బమ్మ మరియు గ్రామ పెద్దల సమక్షంలో ఆలయ పునర్నిర్మాణానికి పునాదులు వేసినట్లు తెలిపారు. 98 సంవత్సరాల చరిత్రకు ఇది నూతన అధ్యాయమని పేర్కొన్నారు. వేంపెంట గ్రామ పూర్వీకులు భక్తిశ్రద్ధలతో 15-02-1928న స్వర్గీయ టేకూరి గాండ్ల చెంచురెడ్డి భార్య బూసెమ్మ ఆధ్వర్యంలో పవిత్ర శ్రీ రామాలయాన్ని నిర్మించినట్లు గుర్తు చేశారు. నేడు భగవంతుని అనంత కృపతో, భక్తుల విశ్వాసంతో, గ్రామ ప్రజల సహకారంతో, ప్రభుత్వ అండదండలతో ఈ మహోత్సవ కార్యక్రమం నిర్వహించబడుతోందన్నారు. నూతన కాంతులను సంతరించుకొని దివ్య కాంతుల మధ్య విరాజిల్లుతున్న శ్రీ రామాలయం పునఃప్రతిష్ఠ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. శ్రీరాముని సంకల్పమే ఈ మహత్తర కార్యానికి మూలమని పేర్కొన్నారు. ఆలయ చైర్మన్ టేకూరి రామసుబ్బమ్మ ఆధ్వర్యంలో శ్రీ రామాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవోపేతంగా జరుగుతోందన్నారు. మూడు రోజుల పాటు వేదమంత్ర ఘోషల మధ్య యాగాలు, హోమాలు, వైదిక పూజలు, భక్తి సంగీత కార్యక్రమాలు, ఆధ్యాత్మిక వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. వచ్చిన భక్తులందరికీ అన్నప్రసాదం, వసతి ఏర్పాట్లు చేయడం విశేషమన్నారు. బాహుబలి హనుమాన్ శోభాయాత్ర, చెక్క భజన, కోలాటం కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అన్ని కార్యక్రమాలను వీక్షించడం, స్వామివారి సేవాభాగ్యం కలగడం ఎంతో ఆనందంగా ఉందని నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి. తిరుపాలు, మండల కన్వీనర్ జి. రవీంద్రారెడ్డి, మద్దూరు తిమ్మారెడ్డి, పాములపాడు సొసైటీ చైర్మన్ సి. గోవిందు, మద్దూరు సొసైటీ చైర్మన్ వాడాల జనార్ధన్ రెడ్డి, డీవీఎంసీ మెంబర్ లింగాల నాగరాజు, ఎర్రగుడూరు చెల్లె హరినాథరెడ్డి, వేంపెంట బోనపల్లె వినయ్ కుమార్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.








## రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య




**కొత్తస్వరం న్యూస్, నంద్యాల:**
నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ యార్డు ఆవరణలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమంలో నందికొట్కూరు ఎమ్మెల్యే శ్రీ గిత్త జయసూర్య రాష్ట్ర మంత్రులు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. గత రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ఫలితాలను ప్రజలకు వివరించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## యోగాంధ్ర 2026 విజేతలకు జాయింట్ కలెక్టర్ అభినందనలు

**రాష్ట్ర స్థాయి పోటీలకు కర్నూలు నుంచి 23 మంది ఎంపిక**

**జిల్లా ఖ్యాతిని మరింత పెంచాలని విద్యార్థులకు ప్రోత్సాహం**

**క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత విజయాలు సాధించవచ్చని సూచన**



**కర్నూలు, జూన్ 17 (కొత్త స్వరం):**
యోగాంధ్ర 2026 కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులను జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ అభినందించారు. కర్నూలు జిల్లా నుంచి 23 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా ప్రతిభ కనబరిచి విజయం సాధించి కర్నూలు జిల్లా ఖ్యాతిని మరింత పెంచాలని విద్యార్థులను ప్రోత్సహించారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో ముందుకు సాగితే ఉన్నత విజయాలు సాధించవచ్చని పేర్కొన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యం మాత్రమే కాకుండా మానసిక ఏకాగ్రత కూడా పెరుగుతుందని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెట్కూర్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి డాక్టర్ వేణుగోపాల్, యోగాంధ్ర ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ అమర్నాథ్, యోగ సంఘం అధ్యక్షుడు అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కుట్టు శిక్షణ కోసం మహిళలు దరఖాస్తు చేసుకోండి




**– ఎస్. జిలాని బి, ఎస్. షర్పుద్దీన్ అలీ**

**పాములపాడు, జూన్ 17 (కొత్తస్వరం) :**
మండల కేంద్రం పాములపాడులో రోజ్ రూరల్ డెవలప్మెంట్ ఉమెన్ ఎంపవర్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 45 రోజుల ఉచిత కుట్టు శిక్షణ కోసం మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఉమెన్ ట్రస్ట్ అధ్యక్షురాలు ఎస్. జిలాని బి మరియు సేవా భారతి యూత్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (వైఆర్డీఎస్) అధ్యక్షుడు ఎస్. షర్పుద్దీన్ అలీ కోరారు. ఈ సందర్భంగా ఎస్. షర్పుద్దీన్ అలీ మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా 18 సంవత్సరాలు పైబడిన మహిళలు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు ఆధార్ కార్డు జిరాక్స్, రెండు ఫోటోలు, చదువుకున్న వారు అయితే మార్క్‌లిస్ట్ జిరాక్స్ కాపీ సమర్పించాలని సూచించారు. పాములపాడులోని కేజీ రోడ్ పక్కన ఉన్న సేవా భారతి (వైఆర్డీఎస్) కార్యాలయంలో 45 రోజులపాటు మహిళా ఇన్‌స్ట్రక్టర్లతో శిక్షణ అందజేసి, అనంతరం సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు రూ.500 నమోదు రుసుము చెల్లించి శిక్షణ పొంది సర్టిఫికెట్ పొందవచ్చన్నారు. మరిన్ని వివరాల కోసం ఉమెన్ ట్రస్ట్ అధ్యక్షురాలు – 9030379008, సేవా భారతి అధ్యక్షుడు – 9573318022 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి




**దూదేకొండలో నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష**

**త్వరితగతిన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తేవాలని ఆదేశం**

**కర్నూలు, జూన్ 17 (కొత్త స్వరం):**
పత్తికొండ మండలం దూదేకొండ గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న టమోటా ప్రాసెసింగ్ యూనిట్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పరిశీలించారు. ఈ సందర్భంగా యూనిట్ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని సూచించారు. టమోటా రైతులకు ఈ ప్రాసెసింగ్ యూనిట్ ఎంతో ఉపయోగకరంగా మారనున్నందున, పనులను త్వరితగతిన పూర్తి చేసి వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## మిశ్రమ, అంతర పంటల సాగును ప్రోత్సహించాలి

**లింగన్న రైతు హైబ్రిడ్ కొబ్బరి తోటను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**16 ఎకరాల్లో సాగు విధానాలపై ప్రత్యేక ఆరా**

**అంతర పంటలు, సూక్ష్మ నీటిపారుదలతో రైతులకు మెరుగైన ఆదాయం**

**కర్నూలు, జూన్ 17 (కొత్త స్వరం):**
దేవనకొండ మండల కేంద్రానికి చెందిన రైతు లింగన్న 16 ఎకరాల్లో సాగు చేస్తున్న హైబ్రిడ్ కొబ్బరి తోటను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ అమలు చేస్తున్న మిశ్రమ, అంతర పంటల సాగు విధానాలను సమగ్రంగా పరిశీలించారు. పంటల వైవిధ్యంతో పాటు అంతర పంటల సాగు రైతులకు అదనపు ఆదాయ వనరులను కల్పిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఆధునిక సాగు పద్ధతులు అనుసరించడం ద్వారా దిగుబడులు పెరగడంతో పాటు ఖర్చులు కూడా తగ్గించుకోవచ్చని తెలిపారు. మిశ్రమ, అంతర పంటల సాగును మరింతగా ప్రోత్సహించాలని, సూక్ష్మ నీటిపారుదల విధానాలను రైతులకు విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.




పాత్రికేయులు కావలెను
కొత్తస్వరం దినపత్రికకు అనుభవం కలిగిన, వార్తా కథనాలు (స్టోరీలు) రాయగలిగే పాత్రికేయ మిత్రులు కావలెను.
నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాలకు రిపోర్టర్లు అవసరం
నందికొట్కూరు - నందికొట్కూరు రూరల్ - పగిడ్యాల - జూపాడుబంగ్లా - కొత్తపల్లె - పాములపాడు - మిడుతూరు
కొత్తస్వరం
9492813364

# కొత్తస్వరం
తెలుగు దిన పత్రిక
## కర్నూలు - నంద్యాల
గురువారం, జూన్ 18, 2026 పేజీ 4


## ఆధునిక సాగు పద్ధతులతో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలి

**కరివేములలో మామిడి తోటను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**హై-డెన్సిటీ ప్లాంటేషన్ విధానంపై ప్రత్యేక ఆరా**

**ఆధునిక సాంకేతికతతో రైతులకు మెరుగైన దిగుబడులు సాధ్యం**



**కర్నూలు, జూన్ 17 (కొత్త స్వరం):**

దేవనకొండ మండలంలోని కరివేముల గ్రామానికి చెందిన రైతు సదాశివరావు హై-డెన్సిటీ ప్లాంటేషన్ విధానంలో సాగు చేస్తున్న మామిడి పంటను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పరిశీలించారు. ఈ సందర్భంగా మామిడి తోటలో అనుసరిస్తున్న ఆధునిక సాగు విధానాలు, నిర్వహణ పద్ధతులపై కలెక్టర్ ఆరా తీశారు. తక్కువ విస్తీర్ణంలో అధిక దిగుబడి సాధించేందుకు హై-డెన్సిటీ ప్లాంటేషన్ ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, సాంకేతికతను విస్తృతంగా ప్రోత్సహించాలని, రైతులకు అవగాహన కల్పించి మెరుగైన సాగు విధానాలను అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు.

## నేర నియంత్రణ, ప్రజల భద్రతే లక్ష్యం

**కర్నూలు జిల్లాలో కొనసాగుతున్న విజిబుల్ పోలీసింగ్**

**రాత్రి వేళల్లో అనుమానాస్పద వాహనాల తనిఖీలు**

**రహదారి ప్రమాదాల నివారణకు "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమం**





**కర్నూలు, జూన్ 17 (కొత్త స్వరం):**

కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం 'విజిబుల్ పోలీసింగ్' కార్యక్రమాన్ని విస్తృతంగా కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా నేరాల నియంత్రణతో పాటు అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారు. కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని సబ్ డివిజన్‌ల పరిధిలో పోలీసులు కట్టుదిట్టంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. కర్నూలు నగరంలో సీఐ తబ్రేజ్ ఆధ్వర్యంలో బ్లూ కోల్ట్స్ బృందాలు, క్యూఆర్టీ పోలీసు బృందాలు పాల్గొని విస్తృత తనిఖీలు చేపట్టాయి. ఈ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు కూడా నిర్వహించారు. రహదారి ప్రమాదాల నివారణకు "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. దీర్ఘ ప్రయాణాల్లో అలసటగా అనిపిస్తే వాహనం ఆపి ముఖం కడుక్కొని, కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని ప్రయాణం కొనసాగించాలని సూచించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని తెలిపారు.

## హోంగార్డులకు హెల్త్ ఇన్సూరెన్స్‌పై అవగాహన కార్యక్రమం





**జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డ్స్ పరేడ్, దర్బార్ నిర్వహణ**

**70 మంది హోంగార్డుల హాజరు**

**ఆరోగ్య భద్రతలో బీమా ప్రాముఖ్యతపై అవగాహన**

**కర్నూలు, జూన్ 17 (కొత్త స్వరం):**

కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో హోంగార్డ్స్ పరేడ్ మరియు దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 70 మంది హోంగార్డులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హోంగార్డ్స్ కమాండెంట్ ఎం. మహేష్ కుమార్ మాట్లాడుతూ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు, వాటి ప్రయోజనాలు, ఆరోగ్య భద్రత కోసం బీమా ప్రాముఖ్యతపై హోంగార్డులకు అవగాహన కల్పించారు. అనారోగ్య పరిస్థితుల్లో ఆర్థిక భారం తగ్గించడంలో హెల్త్ ఇన్సూరెన్స్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ భద్రత కోసం తగిన బీమా పాలసీలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు డీఎస్పీ ప్రసాద్, యాక్సిస్ మేనేజర్ మరియు ఇన్సూరెన్స్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మహిళలు, చిన్నారుల భద్రతే లక్ష్యం





**పెద్ద తుంబలం పీఎస్ పరిధిలోని మాంత్రికి గ్రామంలో అవగాహన సదస్సు**

**మహిళలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించిన పోలీసులు**

**బాల్య వివాహాలు, పోక్సో చట్టంపై వివరాలు**

**పెద్ద తుంబలం, జూన్ 17 (కొత్త స్వరం):**

మహిళలు, చిన్నారుల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తాలూకా సీఐ నల్లప్ప తెలిపారు. మహిళలకు శ్రీరామరక్షలా శక్తి యాప్ ఉపయోగపడుతుందని, మహిళలు తమ హక్కులు మరియు చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మంగళవారం రాత్రి పెద్ద తుంబలం మండలంలోని మాంత్రికి గ్రామంలో ఎస్ఐ విద్యశ్రీ ఆధ్వర్యంలో మహిళలకు శక్తి యాప్, మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులపై జరిగే నేరాలు, బాల్య వివాహాల నివారణ, పోక్సో చట్టం ప్రాముఖ్యత గురించి వివరించారు. పిల్లలపై హింస, వేధింపులు లేదా బాల్య వివాహాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే 1098 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకోవడంలో శక్తి యాప్ ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. అలాగే సైబర్ నేరాల బారిన పడిన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు.





## ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ కాదు: సీఎం రేవంత్ రెడ్డి

**సర్కార్ బడుల నుంచే ఐఏఎస్, ఐపీఎస్‌లు వచ్చారని వ్యాఖ్య**

**ఆరుట్లలో రూ.15 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభం**

**కులమతాలకు అతీతంగా నాణ్యమైన విద్య లక్ష్యమని స్పష్టం**

**మట్టిలో మాణిక్యాలను వెలికితీసేది ప్రభుత్వ విద్యేనని నమ్మకం**

**విద్యతోనే సమాజంలో సమానత్వం సాధ్యమని సీఎం వెల్లడి**

**రంగారెడ్డి, జూన్ 17 (కొత్త స్వరం):**

ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు తొలగాలంటే అందరికీ నాణ్యమైన విద్య అందాల్సిందేనని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఐఏఎస్, ఐపీఎస్, ముఖ్యమంత్రులు అయిన వారు ఉన్నారని గుర్తుచేశారు. ప్రభుత్వ బడుల్లో చదవడం నామోషీ అన్న భావన నుంచి ప్రజలు బయటపడాలని సూచించారు. బుధవారం రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్లలో రూ.15 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. స్కూల్‌లోని డిజిటల్ క్లాస్‌రూమ్స్, లైబ్రరీ, ల్యాబ్స్, అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఆహ్లాదకరంగా ఏర్పాటు చేసిన మైదానంలో విద్యార్థులతో సరదాగా ఫుట్‌బాల్ కూడా ఆడారు. స్కూల్ ప్రారంభోత్సవ సభలో సీఎం మాట్లాడుతూ, ఆరుట్ల పాఠశాలను పైలట్ ప్రాజెక్టుగా నిర్మించామని తెలిపారు. విద్యాశాఖపై ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో ఉన్న అపోహలను తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. విద్య ఖర్చు కాదని, అది భవిష్యత్తుపై పెట్టుబడని సీఎం పేర్కొన్నారు. విద్య ద్వారానే జీవితాల్లో సమూల మార్పు సాధ్యమని అన్నారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యా కమిషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. గత ప్రభుత్వం వర్గాల వారీగా పాఠశాలలు ఏర్పాటు చేసి కులవ్యవస్థను ప్రోత్సహించిందని విమర్శించిన సీఎం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ వేర్వేరు స్కూళ్లు ఏర్పాటు చేశారని అన్నారు. కుల గోడలను కూల్చేందుకే అన్ని వర్గాల పిల్లలు కలిసి చదివేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్ఫూర్తినిస్తుందని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆరుట్ల టీపీఎస్‌లో ఇప్పటికే 1,814 మంది విద్యార్థులు చేరారని సీఎం తెలిపారు. భారీగా దరఖాస్తులు రావడంతో అడ్మిషన్లు నిలిపివేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఈ విజయానికి ఉపాధ్యాయుల కృషే కారణమని కొనియాడారు. తాను కూడా గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఆరో తరగతి చదవడానికి రోజూ ఆరు కిలోమీటర్లు నడిచి వెళ్లేవాడినని తెలిపారు. దేశ ప్రధానులు, రాష్ట్ర ముఖ్యమంత్రులు సహా అనేక మంది ప్రముఖులు ప్రభుత్వ పాఠశాలల నుంచే ఎదిగారని అన్నారు. విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని సీఎం తెలిపారు. 2034 నాటికి తెలంగాణ నుంచి ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించే క్రీడాకారులను తయారుచేయడమే లక్ష్యమన్నారు. త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభిస్తామని వెల్లడించారు. రాష్ట్ర యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ నెల 19న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా భారీ అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## 'రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం ఘనంగా నిర్వహణ

**నంద్యాల టెక్కే మార్కెట్ యార్డులో వైభవంగా కార్యక్రమం**

**రెండేళ్ల ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలితాల వివరణ**

**కార్యక్రమానికి హాజరైన మంత్రులు, ప్రజాప్రతినిధులు**

**జిల్లా యంత్రాంగం సమన్వయంతో విజయవంతమైన నిర్వహణ**

**భారీగా పాల్గొన్న ప్రజలు, అధికారులు**



**నంద్యాల, జూన్ 17 (కొత్త స్వరం):**

నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ యార్డు ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ఫలితాలను ప్రజలకు వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, రోడ్లు, భవనాలు, పెట్టుబడులు మరియు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి పాల్గొన్నారు. అలాగే ఆళ్లగడ్డ, నందికొట్కూరు, పాణ్యం, ఆత్మకూరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ హాజరయ్యారు. వివిధ ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, కూటమి ప్రభుత్వ నాయకులు, అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం






Edited, Printed, Published by **KEDEM RAVI RAJU,** Printed at 3-151, DAMAGATLA NANDIKOTKURU, KURNOOL, ANDHRA PRADESH - 518432, **VSAR PUBLICATIONS,** 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL, ANDHRA PRADESH - 518006, A.P., Editor : **KEDEM RAVI RAJU**, Cell No. 9912213364, Email:kothaswaram2024@gmail.com, **PRGI No. APTEL/2010/31893**, WebSite : www.kothaswaram.com